నవ్య వీక్లీ - రచయిత బి.వి. రమణారావు నిర్వహించిన సంక్రాంతి
కథల పోటీలో విశేష బహుమతి పొందిన కథ

# గోమాత



"డాడీ, సాధుజంతువు అంటే ఏంటి?" నాలుగేళ్ళ చింటూ తండ్రిని అడిగాడు.

"ఆవు సాధుజంతువు. అంటే సాధువులాగా సాత్వికమైనది. ఉత్తమమైన మంచి జంతువు. మేలు చేసేది. హాని చేయనిది. మెత్తనిది..." సన్యాసిరావు చెప్పాడు.

"మెత్తనిదంటే రబ్బరులా మెత్తగా ఉంటుందా?" అంటూ నవ్వాడు.

'కుర్ర వెధవ' చెప్పింది వినకుండా ఎగతాళిగా మాట్లాడే సరికి ఉడుకుమోత్తనం వచ్చింది. "చాల్లే, నోర్మూయ్. పెద్ద మాటలూ నువ్వూనూ" విసుక్కున్నాడు సన్యాసిరావు.

అమ్మతల్లిలా అమాంతం వచ్చి పడిపోయింది శారద. "ఉరుమురిమి మంగళం మీద పడ్డట్టు మధ్యలో వీడి మీద కోప్పడతారేంటి. చేతనైతే తిన్నగా చెప్పండి, లేదా నోరు మూసుకోండి. వీడిని చిన్నెత్తు మాటన్నా ఊరుకోను. వీడు నా బంగారు కొండ" చింటూని ముద్దు చేస్తూ అంది.

"నువ్వు అమ్మరాక్షసివని మర్చిపోయాను" చిన్నగా నవ్వుతూ లెంపలేసుకున్నాడు.

కళ్ళెర్రజేసింది. తడబడ్డాడు. "ఏదో సరదాగా..." గబుక్కున ముఖ కవళికలు మార్చేసి గొణిగాడు.

"మీ వేషాలు కట్టిపెట్టి, గృహప్రవేశానికి మంచి ముహూర్తం పెట్టించుకు రండి. ఈ మాయదారి అద్దె కొంపకి చాకిరీ చెయ్యలేక చస్తున్నా" విసుగు, కోపం కలగలిపి అంది అతని భార్య శారద.

ఆమె పేరుకీ, మాటకీ, రూపానికీ ఎక్కడా పొంతన ఉండదు. మొగుడు ఆఫీసరైనా ఆమె ముందు నౌకరే.

"ఇదిగో వెళ్తున్నా"

"ఎలాగైనా వచ్చే నెలలోనే ముహూర్తం పెట్టించుకురండి..."

"అలాగలాగే"

హడావిడిగా స్కూటర్ బయటికి తీసి స్టార్ట్ చేశాడు సన్యాసిరావు. తిన్నగా నారాయణ సిద్ధాంతి ఇంటి కెళ్ళాడు. అప్పటికే అక్కడ ఆయన కోసం అయిదారుగురు వేచి ఉన్నారు. అయినప్పటికీ అతన్ని గుర్తించి ముందుకు రమ్మని ప్రత్యేకంగా పిలిచారు సిద్ధాంతి.

"రండి సన్యాసిరావుగారూ, ఇలా కూర్చోండి. వచ్చిన పని చెప్పండి..." అడిగారు పద్మాసనం వేసుక్కూర్చున్న సిద్ధాంతి.

"డూప్లెక్స్ హౌస్ కట్టానండి. దాదాపు 40 లక్షలు ఖర్చు అయింది. చూసిన వాళ్ళంతా బ్రహ్మాండంగా ఉందని మెచ్చుకుంటున్నారు. గృహప్రవేశానికి దివ్యమైన ముహూర్తం పెట్టాలి. ఆ ఇంట్లో మేమే కాదు, మా పిల్లలూ, వాళ్ళ పిల్లలూ ఎంతో హ్యాపీగా జీవించాలి. అంతా ఎప్పుడూ మిమ్మల్నే తలచుకోవాలి" ఉబ్బేశాడు.

"బుద్ధి కర్మానుసారిణి అంటారు. మన బుద్ధిని బట్టే కర్మానుసార ఫలం ఉంటుంది. మనం బుద్ధిగా మసలితే ఇల్లే వైకుంఠం అవుతుంది. మనం ఎలా ఉంటామన్నది మన చేతుల్లోనూ చేతల్లోనూ ఉంటుంది..." అన్నారు సిద్ధాంతి.

"మీకో విషయం చెప్పాలి సిద్ధాంతిగారూ! పల్లెలో మాకు ఇల్లు ఉంది. ఇల్లు అంటే పెద్ద మండువాలో చిన్న వాటా. ఒక గది, చిన్న నడవ, ఎడంగా వంటపాక. దాన్ని మా నాన్న కట్టించలేదు. మా తాత కట్టించలేదు. మా ముత్తాత కట్టించారు. ఇప్పటికీ స్ట్రాంగ్‌గానే ఉంది. దానిలో ఎన్ని తరాలు నివసించాయో చూడండి..." గొప్పగా చెప్పాడు.

"ఆ కష్టం, ఆ కట్టుబడి అలాంటివి మరి. ఆ మనుషులూ ఎంతో నీతిగా నిజాయితీగా నిష్ఠగా ఉండేవారు..."

ఆ మాటలకు ఉలిక్కిపడ్డాడు సన్యాసిరావు. అవినీతి సొమ్ముతో ఇల్లు కట్టాడని సిద్ధాంతి ఎత్తి పొడుస్తున్నాడేమోనని కలవరపడ్డాడు ఓ క్షణం.

"మీ నాన్నకీ తాతకీ లేని అదృష్టం మీకు దక్కబోతోందన్న మాట. చాలా సంతోషం. మీరు ఇంటికి శంకుస్థాపన చేయడం, మీరే ఇల్లు కట్టడం, మీరే గృహప్రవేశం చేసి, ఆ ఇంట్లో మీరు ఉండగలగడం అన్నది నిజంగా మహద్భాగ్యం. బహు అరుదుగా లభించే అదృష్టం కూడాను. ఇక పనిలోకి వద్దాం. మీ జన్మ నక్షత్రం, మీ భార్య నక్షత్రం చెప్పండి..." అన్నారు సిద్ధాంతి.

ఆయన మాటలకు పరమానంద పడిపోయాడు సన్యాసిరావు. ఆ వివరాలు చెప్పి, "అన్ని యాంగిల్స్ నుండీ జాగ్రత్తగా చూసి గొప్ప ముహూర్తం పెట్టండి. ముహూర్తబలం ఎలాంటిదో అందరికీ చాటేలా ఉండాలి. ఇంటి పని పూర్తైపోయినట్టే. వచ్చే నెలలోనే ముహూర్తం పెట్టండి. దక్షిణ గురించి ఆలోచించొద్దు..." అన్నాడు డాబుగా.

మందహాసం చేశారు సిద్ధాంతి. "నేను ఒక పని మీద కూర్చుంటే మనసా వాచా కర్మణా దాని మీదే శ్రద్ధ పెడతానుతప్ప పైసా మీద కాదు..."

"అందుకే కదా, మిమ్మల్ని వెదుక్కుంటూ వచ్చిందీ..."

రెండు మూడు పంచాంగాలు తిరగేసి, ఏవేవో లెక్కలేసి అన్నారు "ఒకటి కుదిర్తే రెండోది కుదరడం లేదు..."

"అంటే, ఇంట్లో దోషం ఉందంటారా?"

"ఊహూ. దోషం ఎప్పుడూ ఇంట్లో ఉండదు. మన ఒంట్లోనే ఉంటుంది. మీ జాతకాల్లోనే దోషం ఉంది. అనగా, నడకలో నడతలో నడవడికలో నన్నమాట. శాంతి చేయించుకుంటే మంచిది..."

సన్యాసిరావు ముఖం ఎర్రబడింది. 'అంత మంది ముందు ఒక అధికారిని పట్టుకొని అంత మాటంటాడా?'

"ఆ సంగతి మేం చూసుకుంటాం లెండి. ఉన్నంతలో మంచి ముహూర్తం పెట్టండి చాలు" కించిత్తు రోషంగా అన్నాడు.

"మీ ఇష్టం. ఆపైన ఆ పైవాడి దయ!"

ఏవేవో లెక్కించి చూసి అన్నారు. "వచ్చేనెల 13వ తారీఖు తెల్లవారుజామున 4.49 ని॥లకు అనగా తెల్లవారితే ఆదివారమన్న మాట- ముహూర్తం ఉంది పెట్టమంటారా!"

"ఆదివారమైతే ఇంకా చూస్తారేం, పెట్టేయండి. రావడానికి అందరికీ కుదుర్తుంది" సంబరంగా అన్నాడు.

కొత్త కాగితం తీసుకొని, నాలుగు మూలల్లో పసుపు రాసి, దేవుణ్ణి స్మరించి, గృహప్రవేశ ముహూర్తం రాసి ఇచ్చారు సిద్ధాంతి.

ప్రసాదంలా అందుకుని కళ్ళకద్దుకున్నాడు సన్యాసిరావు. పిమ్మట పర్సులోంచి అయిదువందల నోట్లు రెండు బయటికి తీశాడు. అక్కడున్న అందరికీ కనిపించేలా ఆయన ముందుపెట్టి నమస్కరించి వచ్చేశాడు.

భార్యకు ఫోన్ చేసి చెప్పాడు. ఆవిడ పొంగిపోయింది. "నాకు తెలుసండీ. మీరు బుర్ర సరిగ్గా ఉపయోగించరు గాని ఉపయోగిస్తే మీ అంతటి వారే ఉండరు. దగ్గరుండి ఎంత మంచి ముహూర్తం పెట్టించారూ!"

"చూస్తూండవే. అదిరిపోయే లెవెల్లో గృహప్రవేశం చేస్తాం"

"మనల్నీ మన ఇంటినీ చూసి బంధువులంతా కుళ్ళిపోవాలి. అయితే ఇక ఆ పనుల్లో పడిపోతాను..."

"ఊరికే పడితే చాలదు, పరుగెత్తాలే. ఇంక సరిగ్గా 16 రోజులే ఉన్నాయి. నేనలా కొత్తింటికో అడుగువేసి వస్తాను. మార్బుల్ పాలిష్ వాళ్ళు వచ్చారో లేదో!"

అక్కడ్నుంచి తిన్నగా గృహప్రవేశం చేయబోతున్న డూప్లెక్స్ ఇంటికెళ్ళాడు సన్యాసిరావు.

300 గజాల స్థలం మధ్యలో ముచ్చటగా ఉంది ఇల్లు. చుట్టూ చక్కని ఖాళీ జాగా ఉంది. ఎలివేషన్ అద్భుతంగా వచ్చింది. గోడ పక్కన అతికించిన పాలరాయి మీద 'శారదానిలయం' అక్షరాలు బంగారు వర్ణంతో మెరిసిపోతున్నాయి. ఇంటికి పెయింటింగు వెయ్యడం పూర్తయ్యింది. ఫాల్స్ సీలింగ్ పనీ అయిపోయింది. ఎలక్ట్రికల్ ఫిట్టింగ్స్ పెట్టడం, పాలరాయి ఫ్లోరింగుకి పాలిష్ పెట్టడం అయితే ఇంటి పనులన్నీ పూర్తైనట్టే.

ఎంతో సంతృప్తిగా ఇంటిని చూసుకున్నాడు. ఎంతో గర్వంగా అన్పించింది.

'ఇక అద్దె ఇళ్ళల్లో సర్దుకుపోవాల్సిన ఆగత్యం లేదు. తమకు కావాల్సినట్టు కట్టించుకున్న స్వంతింట్లో తనూ, తన వారసులూ ఎప్పటికీ హ్యాపీగా జీవిస్తారు!'

అనుకున్నాడు తృప్తిగా.

సంబరంగా ఇంట్లో కెళ్ళాడు.

టేకు గుమ్మాల్నీ తలుపుల్నీ మార్బుల్ ఫ్లోరింగునీ చూసి మురిసిపోయాడు.

'రిచ్ లుక్ వచ్చేసింది. దీనికి తగ్గట్టు ఫర్నిచర్ కొనెయ్యాలి. పాత మంచాలనీ సోఫాల్నీ కుర్చీల్నీ అమ్మేసి అన్నీ కొత్తవి కొనాలి. ఇంట్లో ఒక్కటంటే ఒక్క పాత వస్తువు కన్పించకూడదు. ఇంక అన్నీ అంతా కొత్తగా వెలిగిపోవాల్సిందే!' అనుకున్నాడు.

పై అంతస్తులోంచి పాలరాయి పాలిష్ చేస్తోన్న శబ్ధం విన్పిస్తోంది.

మెట్ల మీదా మార్బుల్సే వేయించాడు. వాటి మెరుపు చూస్తూ పైకెళ్ళాడు.

"అబ్బే. పాలిష్ బాగాలేదు. మెట్ల మీద అస్సలు బావోలేదు. పాలిష్ అంటే అద్దంలా మెరిసిపోవాలి. మన ముఖం కన్పించాలి..." అన్నాడు పనివాళ్ళతో.

"మెట్ల మీద పాలిష్ కాస్త తక్కువగానే పెడతాం సార్..."

"ఏం? దానికి డబ్బు తీసుకోవట్లేదా? అదేమీ కుదరదు. మెట్లు కూడా తళతళ మెరిసిపోవాల్సిందే, అద్భుతంగా ఉండాల్సిందే. అది చూసి గృహప్రవేశానికి వచ్చిన వాళ్ళంతా ముక్కు మీద వేలేసుకోవాల్సిందే"

"కాలు జారుతుందని తక్కువగా పాలిష్ పెడతాం. మీరు పెట్టమంటే పెట్టేస్తాం సార్"

"పెట్టమంటున్నాగా, మళ్ళీ బొట్టుపెట్టి చెప్పాలేంటి? పెట్టేయ్. ముహూర్తం పెట్టించేశాం. వచ్చే 13నే గృహప్రవేశం. మూడు నాలుగు రోజుల్లో మీ పని అవగొట్టేస్తే, ఎలక్ట్రీసియన్ వచ్చి ఏసీ, గీజర్స్ అన్నీ బిగించేస్తాడు..."

"వాళ్ళకి మేమేం అడ్డురాం సార్. వాళ్ళ పని వాళ్ళని చేసుకోమనండి..."

"ఆ ముక్క నాకు తెలుసు, నువ్వు నాకు ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు" చిర్రెత్తుకు రాగా అన్నాడు.

మరోసారి కొత్త ఇల్లంతా తిరిగి చూసుకుని ఇంటికెళ్ళాడు.

ఆఫీసుకెళ్ళడానికి రెడీ అయి టిఫిన్ చేస్తోంటే ఇల్లాలు అతడి ముందుకొచ్చి అడిగింది. "ఆవుని మాట్లాడారా?"

"ఆవుని మాట్లాడ్డం ఏవిటే..."

"మీ తెలివి మండినట్టే ఉంది. గృహప్రవేశానికి ఆవు ఉండొద్దూ! ఈ మహాపట్నంలో ఎక్కడ దొరుకుద్దో ఏమో. ముందే మీ అటెండరుతో వాకబు చేయించి అట్టే పెట్టండి..."

"మన పురోహితుణ్ని కనుక్కుంటాను. అలాంటివన్నీ అతనికే తెలుస్తాయి"

"పనిలో పనిగా ఏమేం సరంజామా కావాలో కనుక్కోండి. ప్రింటు చేసిని లిస్టు

ఇస్తారు. మరిచిపోకుండా తీసుకోండి సుమా. అవన్నీ మీ అటెండరుతో ముందుగానే తెప్పించేయండి. ఆనక అదిలేదు ఇదిలేదు అని కథాకళి ఆడక్కర్లేదు"

"ఓ కె.. లంచ్‌కి వచ్చేటప్పుడు మంచి మోడల్ ఇన్విటేషన్లు తెస్తాను, ఫైనలైజ్ చేద్దాం"

"ఈ లోగానే మా వాళ్ళందరికీ ఫోన్లు చేసి చెప్పేస్తానెండి..."

సన్యాసిరావు ఆఫీసుకెళ్ళి గృహప్రవేశం గురించి అందరికీ చెప్పాడు. అంతా అభినందనలతో ముంచెత్తారు. తర్వాత సూపరింటెండెంట్‌ని తన రూంలోకి పిలిచాడు.

"ముందు ముందు చాలా ఖర్చుంది. న్యూ ఫర్నీచర్ కొనాలంటోంది నా మిస్సెస్. కొంచెం బరువుండే ఫైల్సు బయటికి తియ్"

"ఇక ఆ పని మీదే ఉంటాం, మీరు నిశ్చింతగా ఉండండి సార్. అన్నీ చక్కగా చకచకా జరుగుతాయి. ఇది మీ గొప్పా నా గొప్పా కాదండీ, ముహూర్తబలం! అన్నీ అలా అలా తోసుకొచ్చేస్తాయ్!" నర్మగర్భంగా నవ్వి వెళ్ళిపోయాడతడు.

ఫోన్ చేయగానే పురోహితుడు పరుగున వచ్చాడు.

"నారాయణ సిద్ధాంతి గారిచేత గృహప్రవేశానికి ముహూర్తం పెట్టించాను. ఆ రోజున మీరు దగ్గరుండి అన్నీ శాస్త్ర ప్రకారం జరిపించాలి. ఇంకేదో ఒప్పుకొని ఒక అడుగు అటూ, ఒక అడుగు ఇటూ వేస్తే కాదు. ఇంకేం ఒప్పుకోవద్దు"

"ఎంత మాట. తమరికి ఒప్పుకున్నాక ఇంకోవైపు తొంగి కూడా చూడను..." అన్నాడు రామశాస్త్రి.

"ఆవు కావాలి. మీ ఎరికలో ఉంటే ఏర్పాటు చేయండి"

"అబ్బే. ఏదో ఆవు సరిపోదు. పాడి ఆవు కావాలి. దూడ కూడా ఉండాలి. అది కోడె దూడ అయితే మరీ మంచిది. గోసంతతి వృద్ధి చెందుతూనే ఉంటుంది. ఆవు నడిచిన ప్రదేశమంతా పాడి పంటల్తో విలసిల్లుతుందండీ. గృహప్రవేశం రోజున వంటగదిలోనూ ఆవు పాలే పొంగించాలి. అలా చేస్తే ఇక చూస్కోండి ఇంట్లో సంపదలూ సౌఖ్యాలూ ఆనందాలూ పొంగి పొరలుతూనే ఉంటాయి...!"

"అలాగా.. అయితే అలాగే చేద్దాం..."

"చేద్దాం కాదు చేసి తీరాలి. పూర్వపు రోజుల్లో తిరుపతి వేంకటేశ్వర స్వామి గుడి తెరచీ తెరవగానే మొదట గోవుని లోపలికి తీసుకెళ్ళేవారట, తర్వాతి కాలంలో దాన్ని నిలుపు చేసి గోసూక్తం పఠించడంతో సరిపెడుతున్నారు"

"దేవాలయానికే అంత సెంటిమెంటు ఉంటే గృహానికి ఇంకెంత ఉండాలీ. మా అటెండర్ని మీతో పంపిస్తాను కోడెదూడ ఉన్న ఆవుని బుక్ చేయండి..."

"మరి వాళ్ళు..." బొటనవేలితో చూపుడువేలిని గోకుతూ అన్నాడు రామశాస్త్రి

"మీకు తెలీందేవుంది. ప్రతీదీ ధనమయం అయిపోయింది. కాసుల శబ్దం విన్పించకపోతే ఎవరూ కాలు కదపట్లేదు. ఇక ఆవూ దూడ వ్యవహారం..."

"గంటా అరగంటా వ్యవహారమే కదా, ఎంత తీసుకుంటారేంటి"

"సమయ సందర్భాన్ని బట్టి గుంజుతారు. పెద్ద ముహూర్తం అయితే రెండు మూడువేలు దాకా ఇమ్మని కూర్చుంటారు. అదీగాక రవాణా ఖర్చులు అదనంగా ఇమ్మంటారు..."

"మరీ అంత దారుణమా! ఆవుని ఇలా ఇంట్లోకి తీసుకొచ్చి, అలా తీసుకెళ్ళిపోయినందుకు అంత ఇవ్వాలా! సెంటిమెంటుని అడ్డం పెట్టుకొని అడ్డంగా దోచేస్తున్నారు"

"తమరన్నది అక్షరసత్యం. కాలం అలా ఉంది. ఎంతమందినని నిందించగలం చెప్పండి. మనలో మన మాట, ఇవాళ రేపు కథాకార్యాలకి ఆవులు దొరకటమే గగనమై పోతోందంటే నమ్మండి..."

"హమ్మో, అలా అయితే నా శ్రీమతితో పడలేను. కొంప నిలువునా కూలి పోతుందిగానీ, కొంచెం తక్కువలో వచ్చేటట్టు చూడండి"

"అలాగే. ఇక మీ పని అయిపోయినట్టే. నిశ్చింతగా ఉండండి..."

అటెండర్ని తీసుకొని రామశాస్త్రి వెళ్ళిపోయాడు. వెంటనే ఆ విషయం భార్యకి చెప్పాడు సన్యాసిరావు.

"శుభలేఖలేం జేశారు?"

"అవీ వస్తాయి. మధ్యాహ్నం తెస్తాను..."

"క్యాటరింగ్ హై క్లాస్ వాళ్ళకివ్వండి. ఫలానా వారి గృహప్రవేశం భోజనం అదిరిపోయిందని అందరూ చెప్పుకోవాలి. పోనీ ఒక పని చెయ్యండి. అతగాణ్ని ఇంటికి తీసుకురండి. ఏవేం కూరలు వండాలో నేను సెలక్ట్ చేస్తాను..."

"నీ మాటే ఫైనల్. సరేనా!"

చకచకా గృహప్రవేశానికి కావాల్సిన ఏర్పాట్లన్నీ చేసేశాడు సన్యాసిరావు. బంధు మిత్రుల్ని పిలవడం, ఇంటిల్లిపాదికీ కొత్త దుస్తులు కొనడం అన్ని పనులూ పూర్తయ్యాయి.

గృహప్రవేశం రోజు రానే వచ్చింది. రాత్రి రెండింటికే లేచి స్నానాదులు ముగించారు. కొత్త దుస్తులు ధరించి ఐదు కార్లలో అంగరంగ వైభవంగా కొత్త ఇంటికి తరలి వెళ్ళారు. కొత్త ఇల్లు విద్యుద్బల్బుల తోరణాల వెలుగుల్లో జిగేలుమంటోంది. తమతో తెచ్చిన సరంజామానంతా గేటు ప్రక్కన సర్దారు.

"ఆవు ఏదండీ?" చుట్టూ చూస్తూ ఆదుర్దాగా అడిగింది శారద.

ఆ సంగతి మర్చిపోయినందుకు చింతిస్తూ అటెండరు మీద కోప్పడ్డాడు

సన్యాసిరావు.

"మూడున్నరకల్లా తీసుకొచ్చేస్తానన్నాడు సార్"

"ఇప్పుడు నాలుగు దాటింది. ఇంకా ఎందుకు రాలేదు? ఫోన్ చెయ్యి..."

తల గోక్కుంటూ, "ఫోన్ నెంబరు తీసుకోలేదు" అని గొణిగి, "అతడికి ఫోన్ లేద్సార్..." అన్నాడు బిగ్గరగా,

"గొప్ప పని చేశారు. నీకు అప్పగించిన ఒక్క పనీ సవ్యంగా చేయలేవా? ఇప్పుడు టైంకి వాడు ఆవుని తీసుకు రాకపోతే నాకు చచ్చే చావు వస్తుంది..... పురోహితుడేడి? ఆయనా రాలేదా?"

"ఇదిగో వచ్చేశానండీ..." మోపెడ్ దిగుతూ జవాబిచ్చాడు రామశాస్త్రి.

"ఆవునింకా తీసుకురాలేదు. అతడి సెల్ నెంబరుంటే ఫోన్ చెయ్యండి..." గదిమాడు సన్యాసిరావు.

"మీరు నిశ్చింతగా ఉండండి. అతడు దగా చేయడు. పక్కా ప్రొఫెషనల్..." సెల్ నెంబరు వెదికి చేశాడు.

"రింగు వెళ్తోందండి.... ఎంచేతో ఎత్తడం లేదు..."

"అప్పుడే నాలుగున్నరై పోయింది ఆవు ఎక్కడండీ?" నిలదీసింది శారద.

"వచ్చేస్తుంది వచ్చేస్తుంది..." బంధువుల ముందు ఎక్కడ తన పరువు తీసేస్తుందోనని భయపడుతూ సమాధానమిచ్చాడు.

ఇంతలో మినీ ట్రక్కు వచ్చి ఆగింది. అందులోని ఆవుని చూసి, "అదిగో గోమాలక్ష్మి వచ్చేసిందే" సంబరంగా అరిచాడు సన్యాసిరావు.

"ఎందుకు రాదూ, టైముకన్నీ వస్తాయి. గృహప్రవేశం చేస్తున్నది ఎవరు?!" అందామె ఇనుమడించిన ధీమాతో. ఆ వెంటనే "ఎందుకింత ఆలస్యం చేశాడో, నాలుగు కేకలేయండి" అనీ అంది.

జాగ్రత్తగా ఆవునీ దూడనీ ట్రక్కులోంచి దింపి, వారి దగ్గరకు వచ్చాడు వెంకన్న.

"దండాలండి... దారిలో టైరు పంచరైపోనాది. కొంచెం అలీసమైంది. ఏవనుకోమాకండి" వంగి వినయంగా అన్నాడు.

"కొంచెం ఏంటయ్యా. గంట ఆలస్యం అయ్యింది. నువ్వు నాకేమీ మెహర్బనీ చెయ్యట్లేదు. రెండువేల రూపాయలు గుంజుతున్నావు. ట్రక్కుకి ఇంకో నాలుగొందలు దొబ్బుతున్నావు. నేనెవరో తెలుసుగా, ఒళ్ళు దగ్గరెట్టుకొని మసలుకో" అధికార దర్పం ప్రదర్శించాడు సన్యాసిరావు.

"అలా గడ్డి పెట్టండి. విశ్వాసం లేని మనిషి!" వెనకేసుకొచ్చింది భార్య.

"ఆవుకి చిట్టూ తవుడూ గట్రా తెచ్చినారాండీ..."

"మేమెందుకు తెస్తాం, అవన్నీ నువ్వే చూసుకోవాలి. అడిగినంత డబ్బు ఇచ్చాక, మాకేం సంబంధం?" అన్నాడు సన్యాసిరావు.

"ఈ పూట ఆవు మీది అన్ని హక్కులూ మావే. పాలు పొంగించడానికి ఆవు పాలు పితికి ఇయ్యి" అందతడి భార్య.

వ్యవహారం ముదురుతోందని గ్రహించి, "లోపల ఒడ్లు పెడతారులే. ముందు ఆవుని తీసుకురా, ముహూర్తానికి టైం అవుతోంది" తొందరపెట్టాడు రామశాస్త్రి.

"తమరు మొదలెట్టండి సామీ. ఇప్పుడే రెండు పరకలు ఏసి సెనాల్లో తోలుకొచ్చేస్తా..." అన్నాడు వెంకన్న.

"సొల్లు వాగుడు కట్టిపెట్టి తోలుకు రావోయ్. తర్వాత తింటాదిలే" కసిరాడు సన్యాసిరావు.

అతడి వంక అదోలా చూసి, గొణుక్కుంటూ వెళ్ళి, ఆవునీ దూడనీ గేటు దగ్గరకు తీసుకొచ్చాడు వెంకన్న.

"చూడ ముచ్చటగా ఉంది దూడ. ఆవు ఈని మూడు నాలుగు నెలలవుతుందేమో!" ఒకావిడ అంది. ఆ మాటలు అర్థమైనట్టు ఆవు తలెత్తి ఆవిడ వంక చూసింది. పిమ్మట బిడ్డ వీపు ఆప్యాయంగా నాకసాగింది.

"మగ దూడేనా?" సన్యాసిరావు ఆరా తీశాడు.

"కోడెదూడే సామీ. దగా సేస్తానేంటీ..."

ఆవూ దూడల కాళ్ళకు పసుపు రాయించాక అన్నాడు రామశాస్త్రి "అయ్యా, ఇక కార్యక్రమం మొదలుపెడతాను. ఆడవాళ్ళు నీళ్ళ బిందెలు ఎత్తుకున్నారు కదా. సన్యాసి రావుగారూ, మీరూ, మీ భార్య గారూ దేవుడి ఫోటోలూ పూజా సామాగ్రి తీసుకోండి... అమ్మా, మీ పళ్ళెంలోని దీపపు కుందెల్లో ఆవు నెయ్యి పోసి దీపారాధన చెయ్యండి... శుక్లాంబరధరం విష్ణుం......."

గేటు దగ్గర పసుపుకుంకాలతో పూజ చేశాడు రామశాస్త్రి. మొదట ఆవూ దూడల్ని లోపలికి తీసుకెళ్ళాడు వెంకన్న. తదనంతరం సన్యాసిరావు దంపతులు, వారి పిల్లాడు చింటూ, బంధుమిత్రులూ అనుసరించారు.

ఇంటి చుట్టూ మూడుసార్లు ప్రదక్షిణ చేశారు. నడవడానికి దూడ ఇబ్బంది పడుతుంటే సాయం ఉండి నడిపించాడు వెంకన్న.

సింహద్వారం దగ్గర పూజ చేయించాడు రామశాస్త్రి. గుమ్మడి కాయ మీద కర్పూరం పెట్టి వెలిగించి గుమ్మానికి దిష్ఠి తీసి గుమ్మంకేసి కొట్టాడు సన్యాసిరావు. అది చక్కగా పగిలేసరికి, "చూశారా చూశారా" అంది గొప్పగా శారద.

పిమ్మట కొబ్బరికాయలు కొట్టారు సన్యాసిరావు దంపతులు.

సరిగ్గా ముహూర్తం సమయానికి ఆవూ దూడల్ని ఇంట్లోకి తీసుకెళ్ళాడు వెంకన్న.

"ఆవుతో కుడికాలు ముందు పెట్టించు" అని శారద అరుస్తూనే ఉందిగానీ ఆవు ఎడం కాలు పెట్టింది.

"నువ్వు చూసుకోవద్దూ" వెంకన్న మీద కయ్ మన్నాడు సన్యాసిరావు.

"ఏం ఫరవాలేదండి, మీరు కుడికాలు పెట్టాలి గాని ఆవు ఏ కాలు పెట్టినా శుభమే" పురోహితుడు సమర్థించాడు.

సన్యాసిరావు దంపతులు కుడికాలు పెట్టి గృహంలోకి ప్రవేశించారు. చింటూ కూడా కొబ్బరికాయ కొట్టాడు.

హాల్లో, గదిలో, వంటగదిలో నవధాన్యాలను చిమ్మించాడు రామశాస్త్రి. ఆవు దూడల్ని కూడా ఇల్లంతా తిప్పారు.

"ఆవు దూడలకు ఒడ్లు పెట్టండీ..."

రామశాస్త్రి మాటలకు అడ్డు తగలింది శారద "ఇంకా పై అంతస్తుకి వెళ్ళకుండా ఇప్పుడే ఎలా పెడతాం? తర్వాత పెడతాంలే"

ఆ మాటలు వింటూనే కంగారుపడ్డాడు వెంకన్న "పై కెక్కలేదు సామీ. ఇంటి చుట్టూ తిరిగింది. ఇంట్లో తిరిగింది. సరిపోద్ది. తమరు సెప్పండయ్యా" రామశాస్త్రిని అర్థించాడు.

"ఏం చెయ్యాలో ఎలా చెయ్యాలో నువ్వు మాకు డిక్టేట్ చేస్తావేంటి? అసలు ముఖ్యమైన ఇంటి భాగమంతా పైనే ఉంది. క్రింద హాలూ, గెస్ట్ రూం, కిచెనూ మాత్రమే ఉన్నాయి. పడగ్గదులు రెండూ పైనే ఉన్నాయి. పైన కూడా ఆవు తిరగాల్సిందే. ఊరికే తీసుకొచ్చినట్లు మాట్లాడతావేంటి?" వెంకన్న మీద బిగ్గరగా అరిచాడు సన్యాసిరావు.

"పశువులు మెట్లెక్కడం మేం చాలా సార్లు చూశాం. మాకేం తెలీదనుకోకు" శారద అంది గుడ్లెర్రజేస్తూ.

వెంకన్న జంకాడు. "ఎలాగోలా ఆవుని ఎక్కిస్తాన్లెండి..." అని దూడని ఎక్కడో అక్కడ పలుపుతో కట్టేద్దామని అటూ ఇటూ చూస్తోంటే, సన్యాసిరావు ఒళ్ళు మండిపోయింది.

"ఏం చేస్తున్నావోయ్, నకరాలు చెయ్యక దూడని కూడా పైకి తీసుకెళ్ళు..."

సన్యాసిరావు గర్జనకి ఆవు చివ్వున తలెత్తి చూసింది అతడివైపు. దూడ వీపు నిమురుతూ, "సిన్నపిల్ల, ఎక్కలేదండి. ఇందాక సూసేరుగా, ఇంటి సుట్టూ తిరగడానికే నానా యాతన పడింది" అన్నాడు వెంకన్న.

అతడి భావం, బాధ అర్థమైనట్లు తలాడించింది ఆవు.

"అదేం కుదర్దు. రెండిట్లనీ పైకి తీసుకెళ్ళాల్సిందే. ఆలస్యం అయిపోతోంది. అలా చూస్తూ నిలబడ్డారేవండీ, రెండు కేకలేయండి"

భర్తని ఎగదోసింది శారద. ఏదో చెప్పబోయిన వాడల్లా పరిస్థితి చూసి వెనక్కి తగ్గాడు రామశాస్త్రి.

బంధుమిత్రులు ఆవుని పైకి తీసుకెళ్ళి తీరాలనీ, అక్కర్లేదనీ, పాపం దూడ చిన్నదనీ, ఫలానా వారి గృహప్రవేశంలో పై అంతస్తుకి తీసుకెళ్ళలేదనీ రకరకాలుగా చెప్పుకోసాగారు.

"మిగతా వాళ్ళ గోల మా కనవసరం. వేరే అంతస్తు అయితే వేరే సంగతి. ఇది డూప్లెక్స్. క్రిందా పైనా కలిసి ఒకే ఇల్లు..." కసిరినట్లుగా అని, "అలా నిమ్మకి నీరెత్తినట్లు కూర్చున్నావేంటి. ఆవునీ దూడనీ పైకి తీసుకెళ్ళు" ఆర్డరేశాడు సన్యాసిరావు.

ఆవుకి సంభాషణ అర్థమైనట్టే ఉంది. గుర్రుగా చూసింది. వెంకన్న ప్రాధేయపూర్వకంగా చూసి క్షమించమంటూ చేతులు జోడించాడు.

"నీకు చెముడా?" అరిచింది శారద.

"తొందరపడకుండా మెల్లగా తీసుకెళ్ళు" పరిస్థితి అర్థం కాగా రామశాస్త్రి మెల్లగా చెప్పాడు. వేరే గత్యంతరం లేక ఆవుని మెట్లెక్కించి, దూడనీ ఎక్కించబోతుంటే ఆవు వెనక్కి వచ్చి వెంకన్నని చిన్నగా తోస్తూ తలాడిస్తూ వారించింది.

"తల్లి బాధ సూడండి సావీ" దీనంగా అన్నాడు.

"ఆవు అలా వెనక్కి రాకూడదు. అనర్థం!" ఎవరో అన్నారు.

"కర్ర తీసుకొని ముందు ఆవుని పైకి తోలు. దాని వెనక దూడ అదే వెళ్తుంది. తల్లీ బిడ్డల గురించి నీకొక్కడికే తెలుసు అన్నట్టు మాట్లాడతావేంటి? నేనూ పల్లెలో పుట్టి పెరిగిన వాణ్ణే" ఈసడింపుగా అన్నాడు సన్యాసిరావు.

"నేనూ పిల్లాడ్ని కన్న తల్లినే, గొడ్రాలిని కాదు" అంది శారద చింటూ తల నిమురుతూ.

"ఆవుని పైకి తోలు వెంకన్నా" రామశాస్త్రి బాధ కప్పి పుచ్చుకుంటూ అన్నాడు.

"అయ్యో ఖర్మ! పై కెళ్ళకుండా మెట్లకాడే ఆగిపోయాం. దాన్ని నువ్వు తోల్తావా మేం తోలమా?" కోపంగా అంది శారద.

ఆమె వంక ఆవు కోపంగా చూసింది. కొమ్ములు చూపుతూ తల ఆడించింది.

"ఆవు సాధు జంతువన్నావుగా నాన్నా, ఆవుకి కోపం వచ్చింది! కోపం వచ్చింది!" చప్పట్లు కొడుతూ గంతులేశాడు చింటూ.

"తల్లి పేణం కదా బాబయ్యా, బిడ్డకోసం కొట్టుకుంటాది. ఎంత పసువైనా దానికీ పేమ ఉంటాది..." చింటూకి చెప్పి, ఆవుని మళ్ళీ మెట్లు పైకి తోలి అదిలించాడు. అది సగం దూరం ఎక్కి, ఆగి, తలతిప్పి, దూడవంక ఆదుర్దాగా చూసింది.

ఆవుదూడ ఎక్కడానికి సంశయిస్తోంటే దాని మెడకున్న పలుపు పట్టుకుని లాగుతూ

అతికష్టం మీద ఎక్కించసాగాడు వెంకన్న. పై మెట్టుదాకా ఎక్కేక, ఆగి, భయం భయంగా దూడ వంకే చూస్తూ నిలబడింది ఆవు. దానికి టెన్షన్‌గా ఉందేమో మెట్ల మీద పేడ వేసింది. మూత్రం పోసింది. సంబరపడి పోయింది శారద.

"చూశారా చూశారా. ఆవు నట్టింట్లో పేడ వేసింది. మేం బోలెడు పుణ్యం చేశాం. మా ఇల్లు పావనమైంది" ఆనందపడిపోయింది శారద.

'ఇదంతా నా ప్రతాపమే' అన్నట్టుగా చూసి "నేను గట్టిగా పట్టు పట్టాను గనుకే పైకి తోలుకెళ్ళాడు..." అన్నాడు సన్యాసిరావు ఫోజు కొడుతూ.

ఆవు, దూడ పై ఫ్లోర్‌లోకి వెళ్ళిపోతే, తాము కూడా పైకెక్కొచ్చని ఎదురు చూస్తున్నారు బంధువులంతా.

దూడ కాళ్ళు జారుతుండడం చూసి, "ఆవు ఉచ్చ పోసింది గదండి, కాలు జారతాంది. ఎనక్కి తీసుకొచ్చేస్తాను సావీ" మొత్తుకున్నాడు వెంకన్న.

"అదేం కుదర్దు. ఇంకో పదడుగులేస్తే పై కెళ్ళిపోతుంది. దాన్ని వెనక్కి రానివ్వొద్దు. వెధవ్వేషాలు మాని పైకి లాగుతావా, నన్ను రమ్మంటావా?" ఉగ్రుడై రంకెలేశాడు సన్యాసిరావు.

తల కొట్టుకుంటూ దూడని మెట్లెక్కించడానికి ప్రయత్నించసాగాడు వెంకన్న. దూడ మొరాయిస్తోంది. అతడి వంక ఆవు బుసలుకొడుతూ చూసింది. ఇంకో మెట్టు ఎక్కింది దూడ.

"ఇదే ఊపు. లాగు లాగు..." ఊతమిచ్చింది శారద.

"లాగు లాగు. ఎంతసేపు చేస్తావ్? పశువంటే గడ్డి తింటుంది. నీకేం పోయేకాలం! కడుపుకి ముప్పొద్దులూ అన్నమే మెక్కుతున్నావుగా. లాగవోయ్ లాగు!" గదిమాడు సన్యాసిరావు.

అదిలిస్తూ బ్రతిమాలుతూ మరి నాలుగు మెట్లెక్కించాడు వెంకన్న. ఇంకో రెండు ఎక్కితే చాలు పైకెళ్ళిపోతుంది.

ఇంతలో ఊహించని ఘోరం జరిగిపోయింది. ఒకేసారి దూడ వెనక కాళ్ళు రెండూ జారాయి. వెనక్కి విరుచుకుపడింది. వెంకన్న ఆపలేక, తాడు వదిలేశాడు. దూడ దొర్లుకుంటూ దొర్లుకుంటూ క్రిందికొచ్చి పడిపోయింది.

దాని నోట్లోంచీ చెవుల్లోంచీ రక్తం వస్తోంది. గిలగిలా కొట్టుకుంటున్న దూడని చూసి బెంబేలు పడిపోయారు. దూరంగా జరిగి దాని వంక భయం భయంగా చూడసాగారు.

ఇంతలో ఆవు అంబాకారం చేస్తూ పై నుంచి క్రిందికి వేగంగా దిగిపోయింది. ప్రాన్పడిపోయి చూస్తున్న వెంకన్నని త్రోసుకుంటూ క్రిందికొచ్చేసింది.

దూడ వంక చూస్తూ చుట్టూ కలతిరిగింది. కలదొక్కింది. ఆర్తిగా బాధగా చూసింది. ముట్టెతో గెంటింది. నాలికతో నాకింది. కాలిగిట్టతో తోసింది. దూడలో కదలిక లేదు!

'అంబా' అంటూ దిక్కులు పిక్కటిల్లేలా అరిచింది. జలజలా కన్నీళ్ళు కారిపోతున్నాయి. అందరి వంకా బుసలు కొడుతూ చూసింది అవు.

అకస్మాత్తుగా సన్యాసిరావు మీదకు దూసుకెళ్ళి కొమ్ముల్తో అతడి పొట్టలో పొడిచింది. పేగులు బయటికొచ్చాయి "అమ్మా!" అంటూ అర్తనాదం చేస్తూ కూలబడిపోయాడు.

అంతా చేతుల్లోనివన్నీ వదిలేసి తలో వైపుకీ పరుగులు తీశారు.

ఆవు ఉగ్రత ఏమాత్రం తగ్గలేదు. శారద వెంట బడింది. ఆమె చింటూ చేయి పట్టుకుని పరుగెడుతూ కాలికేదో తగలగా పడిపోయింది. ఆమె మీంచి తొక్కుకుంటూ వెళ్ళింది. గబుక్కున వెనుదిరిగి మళ్ళీ తొక్కుకుంటూనే తిరిగొచ్చింది. ఆమె గావుకేకలు పెడుతున్నా ఎవరూ దగ్గరికి రాలేదు. భయంతో వణకుతున్న చింటూని చూసింది గానీ ఎందుచేతో ఆవు వాడి జోలికెళ్ళలేదు.

బిడ్డ ముందు కూలబడి, భోరున ఏడుస్తూ తల్లిఆవు చేస్తున్న 'అంబా' కారాలు ఆ కొత్త ఇంట్లో ప్రతిధ్వనించసాగాయి!

*            *            *

**(నవ్య 24-1-2018)**